# కన్నీళ్లు

-పెద్దింటిఅశోక్ కుమార్

**'కీక్'**మని హారన్.

సైరన్ మోత విన్న కంపెనీ కార్మికుల్లా వాడకట్టు జనం. బిందెలతో వాకిట్లకు పరుగు. కూసున్న వాళ్లు కూసున్నట్టు, నిలవడ్డ వాళ్లు నిలవడ్డట్టు బిందెలను అందుకున్నారు. రథం మీద దేవుడు ఊరు తిరిగితే మంగళార్తులు ఇయ్యడానికి నిలవడ్డట్టు వాకిళ్లలో జనం.

అందరినీ ఒకసారి గర్వంగా చూసి రెండు కుదుపులతో మలుపు తిరిగింది నీళ్ల ట్యాంకర్. నడీవానకాలంలో గూడా ఊరుతిరుగుతున్నందుకు, అదీ బురద అంటకుండా తిరుగుతున్నందుకు దానికి గర్వంగా ఉంది. అదే గర్వంతో అవుతలి సందులోని గౌరమ్మను చూసి నవ్వింది. రమ్మన్నట్టు నీళ్ల పైపుతో సైగ చేసింది. వెంటనే గౌరమ్మ ప్లాస్టిక్ బిందెతో రెండు జంగల్లో రోడ్డు దాటి ట్యాంకర్ దగ్గరికి వచ్చింది. ట్యాంకర్ మాత్రం ఏమీ తెలువనట్టు బెస్త ఎంకవ్వ ఇంటి ముందట ఆగింది.

ఎంకవ్వ, ఇద్దరు కోడండ్లు, కొడుకులు బిందెలతో ట్యాంకర్ వెనుకకు వచ్చి నిలవడ్డరు. డ్రైవర్ రాజు నట్టు తింపే పానాతో ఎనక్కివచ్చి పైపు నట్టు తింపుతూ ఇంటికి పది బిందెలే... ఒక్కటి ఎక్కువియ్య. లెక్కతోని పట్టుకోండ్రి' అన్నడు.

"అగో... పది బిందెలు ఎవల ముక్కుల వోత్తవు. నువ్వు వచ్చేదే మూడు రోజులకొకసారి. పది బిందెలు పోత్తే యాడికి మొదలయితయి" ఎంకమ్మ కోపంగా అంటూ బిందెతో పైపు ముందట నిలబడింది.

రాజు నట్టు ఇప్పకుండానే "నాకు అవ్వన్నీ తెలువది. బుద్దుంటే పట్టుకోండ్రి. లేకుంటె లేదు. గా పంచాది ఆఫీసు దగ్గరికి వచ్చి ఎవ్వలు మాట్లాడరుగనీ ఇక్కడ ఐదువొయ్యి పదివొయ్యి అంటరు. రోజు ఇరవై ట్రిప్పులు కొట్టేది. ఇప్పుడు పది ట్రిప్పులు చేసింద్రు..." అంటున్నప్పుడే ఎంకమ్మ పెద్ద కొడుకు 'అగో.. భయమా... అడుగుతపా... నేను అడుగుత పారా... సర్పంచ్ను. మావాడ కట్టుకే తక్కువ పొయ్యి మన్నడా..? ఏం కడుక్కోమ్మంటడో అడుగుత' అన్నడు.

'ఇగో... బుచ్చన్న.. అవ్వన్నీ నాకు తెలువయి. నీళ్లు ఇప్పన్నా.. వద్దా? ముందు ఈ ముచ్చట చెప్పు' రాజు కోపంగా.

టాంకర్ నవ్వుతుంది. ఆ నవ్వు పైపులోంచి కారే నీళ్లు భూమిపై పడుతున్నప్పుడు చేసే చప్పుడులో వినిపిస్తుంది. ఎండిన గొంతులను ఎక్కిరిస్తూ కారిన నీళ్లు పాయగా వాకిలి మీద పారుతుంది.

'ఆ.. పొయ్యి.. పొయ్యి.. ఎవలకన్నా ఎక్కువ పొయ్యాలె. నీ సంగతి అప్పుడు చెప్తా..' పైపు మూతి ముందు బిందెను పెడుతూ పెద్దకోడలు. రాజు గులుక్కుంటూ పైపు నట్టు తిప్పిండు. పైపు రెండు దిక్కుల మంచినీళ్లు బుడుగుమని బయటకు వచ్చినయి. ఎంకమ్మ ఇద్దరు కోడండ్లు చెరో దిక్కు బిందెలు పడుతుంటే కొడుకులు అందుకుంటున్నరు.

పక్క సందు గౌరమ్మ 'తమామ్ లెవ్వు. తాగుడుకు ఒక బిందె ఇయ్యుండ్రుల్లా...' అంటూ ముందుకు రాబోయింది. ఎంకమ్మ కోడండ్లు ఎనుకకు నూకింద్రు. పడబోయి నిలదొక్కుకుంది గౌరమ్మ.

"ఇగో.. గౌరా.. రోడుమీద మీ వాడ కట్టోళ్లు ఎందరు నిలవడ్డరో సూడు. నీ ఒక్కదానికిత్తే వాళ్లందరు దారి వడుతరు. ముందు మమ్ములను పట్టుకోనియ్యి. అటెనుకు పట్టుకుందువు" ఎంకవ్వ అన్నది.

గౌరవ్వ నిలవడ్డది. రాజు బిందెలను లెక్కవెడుతుండు. లెక్కవెడుతూ "ఓ రాజన్నా.. మీరు గూడ రాండ్రి.. పట్టుకుందురు.. ఇల్లిల్లుకు ట్యాంకర్ ఆ గది. అట్ల ఆపితే వచ్చిన పైసలు డిజిల్కు సాలయి. మూడిండ్లకు ఒక జాగల ఆప్రత. మూండిండ్లోళ్లు రాండ్రి" అన్నడు.

"అగో... ఇదో కొత్త సిస్టం పెట్టినవు. ఆడికి ఈడికి ఎంతని మోత్తం" అంటూ మిగిలిన రెండిండ్లు లైను గట్టినయి.

"అగో.. ఆగు. మేము పట్టుకుందుమా వద్దా.. మీద మీద పడవడితివి." వెనుకనే వచ్చి నిలబడ్డ రాజన్న భార్యతో అన్నది ఎంకవ్వ పెద్దకోడలు.

అప్పటికే రాజన్న గరం మీదున్నడు. తన ఇంటి ముందు ఎందుకు ఆగదని అతడి కోపం. 'మళ్లీ వచ్చిన్నాడు ఎక్కడ ఆపుతడో చూస్త' అని లోలోపల మసులుతుండగానే ఈ మాటలు విన్నడు. భార్యకంటే ముందుగానే అందుకుని "ఎన్ని పడుతవు..? నేను లెక్కవెడుతలే

నను కుంటున్నవా... పది బిందెలు ఎప్పుడో అయి నయి" అన్నడు.

కోడలుకు ఆసరగా ఎంకవ్వ "ఎక్కడయినయి. లెక్కవెట్టినవా... గాలి మాటలు మాట్లాడద్దు. మాట మాట్లాడితే ఇమరస ఉండాలె. ఇది ఎనిమిదోది. ఇంక రెండు పడితె నిండుతయి" అన్నది.

కొడుకులిద్దరు తమవంతు రాలేదన్నట్టు నీళ్లు మోస్తనే ఉన్నరు.

"ఏంది..? ఎనిమిదా.. పదినిండినయి. జరుగు" రాజు మాటలతో లొల్లిమొదలయింది.

ఒకలనొకలు తోసుకుంటున్నారు. తిట్టుకుంటు న్నారు.

ట్యాంకర్ నవ్వుకుంది. బిందె పట్టుకుని బీరి పోయిన గౌరమ్మ వైపు జాలిగా చూసి రెండు బిందెల నీళ్లను కింద గుమ్మరించింది. కింద పడుతున్న నీళ్లను చూసి ఆశగా గౌరమ్మ ముందుకు రాబోతుంటే "ఏ.. లొల్లి.. నీళ్లు కింద పోతున్నయి. మీరు పట్టుకుంటరా.. మేము పట్టుకోవాల్నా.." గౌరమ్మను వెనక్కి నెట్టుతూ ఇంకో ఇంటివాళ్లు ముందుకు వచ్చింండ్రు.

"అయ్యో.. కొద్దిగనన్నా మొఖం సూడరు. పొయ్యి మీద ఎసరుంది. ఈ ఒక్క బిందెడు ఇయ్యండ్రి" ముం దుకు తోసుకొనిపోతూ అన్నది గౌరమ్మ.

రెండడుగులు ముందుకు వేసిందో లేదో రాజన్న భార్య "సూడు గౌరమ్మా... సుట్టమైతే ఇంటికిరా. బుక్కెడు తినిపో. అంతేగనీ ఇక్కడ అందరొక్కటే. నువ్వు పొయ్యి మీద ఎసరు పెట్టినవు. మాకు ఎసరు పెడుదా మంటే నీళ్లే లెవ్వు. నీకు ఒక్కదానికి ఇచ్చినమనుకో. మీ వాడకు వాడ బిందెలతోని వత్తరు. రోడు మీద జూడు. బిందెలు వట్టుకుని కొంగలు చూసినట్టు సూత్తండ్రు. నిన్ను ఇక్కడ ఆపినమని అక్కడ వాళ్లు ఆగుతున్నారు" అన్నది.

లెక్కలు తెగలేదు. పది నిండినయనిరాజు. నిండ లేదని వాళ్లు. ఎక్కువనే అయినయని పక్కవాళ్లు. ఏమాయె. అక్కడనే ఉంటవా..? ముందుకు రావా..? అని ముందున్నోళ్లు.

రాజు కోపంగా టాంకర్ ఎక్కి స్టార్ట్ చేసిండు. టాంకర్ వయ్యారంగా నడుము ఊపింది. బుస్సుమని ఊపిరి పీల్చుచుంది. పకపక నవ్వింది. మొరం దేలిన వాకిళ్ల మొఖాల మీద నాలుగు నీటి చుక్కల్ని చల్లుతూ ముందుకు కదిలింది. కదులుతూ కదులుతూ ఉంటే ట్యాంకర్‌కు కప్ప కనిపించింది. ట్యాంకర్‌కు కప్పలంటే కోపం. తను స్వేచ్ఛగా ఊర్లో తిరుగకుండా అవి కుట్ర పన్నుతున్నాయని నమ్మకం. అవి బెకబెకమని వానను పిలుస్తాయని దానికి కోపం. ఆ మధ్య కప్పతల్లి ఆట ఆడిన నుండి కోపం మరీ ఎక్కువయింది.

కప్ప భయం భయంగా తప్పుకోబోయింది. కుదుర లేదు. మనుషుల దిక్కు ఆశగా చూసింది. ఎవలూ దాన్ని చూడలేదు. దేవున్ని వేడుకుంది. ఎవలూ రాలేదు. ట్యాంకర్ కింద కసుక్కుమని నిలిగిపోయింది. చిదలు చిదలై పయ్యకు అంటుకపోయింది.

## కన్నె కల

నవ్య వస్త్ర పరిధానముతో
సుమ సౌరభాకృత
సౌమ్య లేపనాలతో
అప్సరసలా ముస్తాబై
నా ప్రతిబింబాన్ని
దర్పణంలో దర్శిస్తే
తళుక్కుమందొక తలంపు
మగాడి రూపంలో
మనసే పరకాయ ప్రవేశం చేస్తే
ఈ మగువనొక వేగిపై ఎక్కించి
దండకారుణ్య మేరలు దాటి
రాక్షస వివాహ సంరంభంతో
రణరంగానికి సిద్ధమయ్యే దానిని
కానీ... తెగతెంపులేని తలంపుతో
తలవంచి తనవాడికై నిరీక్షిస్తూ
కోటి ఆశల దీపికలను
క్రీకంట గురిపిస్తూ
చిరునగవు కోసం
ఒంటి రక్తాన్నంత
కంటి పాపలో కేంద్రీకరించా
శ్వాసతో మనసునేకీభవించి
సమయాన్నంత గణిస్తూ
ఎదుటివైపు గమనిస్తే
ఏ స్పందన లేని జడత్వం
యవ్వనమెరుగని అలసత్వం
ఒక్కసారి యెదలో అలజడి
ఆకాశం విరిగిపడినట్టు
అంబోధి హోరెత్తినట్టు

-వూట్ల భద్రయ్య

గౌరమ్మ బిందెతో ఆశగా ముందుకు ఉరికింది. బిందెల నాలుగైదు నీటిచుక్కలు పడ్డయి. మూడవ ఇంటి ముందు ట్యాంకర్ ఆగిందో లేదో మూడు ఇండ్ల చుట్టుముట్టినయి. రాలని నీళ్ల కోసం గౌరమ్మ బిందెను పట్టుకుంటే రాజు వచ్చినట్టు తిప్పిండు. పైపు నుండి రెండు దిక్కులా నీళ్లు బుడుగ్గుమని వచ్చినయి.

'ఓ అమ్మా.. జరుగు. మేము పట్టుకున్నంక పట్టు కుందువు. నిన్న మీ వాడకు రానే వచ్చె..' ఓ పడుసు గౌరమ్మను ఎనుకకు నూకి పైపు ముందట బిందె వెట్టింది.

"అయ్యో.. మనుమరాలా.. ఊరికిపోయి ఇయ్యల్లనే వచ్చిన్నో... ఇంట్ల సుక్కలేదు. తాగేతందుకు ఒక్క బిందె ఇయ్యుండ్రి" అన్నది బతిలాడుతు.

పడుసు పడుసా పెడుసా అన్నట్టుంది. మాట గుంజి మాట్లాడుతలేదు. "నిన్న మీ వాడకు బిందె వట్టుకుని వత్తే తరిమి తరిమి కొట్టిండ్రు. ఇయ్యల్ల మేమెట్ల ఇత్తం..." అని మూడిండ్ల గుంపు వైపు చూసి 'మీ వాడకు అందరు మూటిమీదుంటరు. ఒక్కలు వద్దంటే అందరు వద్దంటరు. మా తొడుసుమల్లె వాడ అట్లగాదు. తన బిందె నిండితె సాలంటరు' అంటూ బిందె నింపుకుని ఇంట్ల పోసి వచ్చి లైను గట్టింది.

గౌరమ్మ పిల్లికూనయింది. పులుకు పులుకు మొఖాలు చూస్తుంది.

'ఎవలట.. తొడుసుమల్లోళ్లు. మొగడు మస్కట్ పోయిండేమో... భూమి మీద ఆగుతలేదు' ఎనుక నుంచి ఎవరో అన్నరు. ఆ మాటలు పడుసు చెవుల వడ్డయి.

పడుసు కోపంగా. "ఔ.. పొయిండు. నువ్వు గూడ తోలనుంటివి. ఇంట్లెందుకు పండవెట్టుకుంటున్నవు."

"నా మొగన్ని నేను పండవెట్టుకుంటున్న. మంది నైతేగాదు గదా" సమాధానం.

"ఆహా.. మందిని పండవెట్టుకునేటోళ్లు ఎవలు..? ఎవతి చూసింది. ఎవతి వట్టింది..." పడుసు లొల్లి. లంకాపోడి. ధూంధాం కొట్లాట. ఒకలనొకలు మాటలతో ఎత్తేసుకున్నరు.

మాటలకు ట్యాంకర్ చెవులు మూసుకుంది. విన లేక మూడిండ్ల ముందుకు పోయి నిలబడింది.

"ఓ కొడుకా.. నీ బాంచెను. శాతగానిదాన్ని. ఎంత దూరం రావాలె. ఈ బిందె పట్టియ్యవా" బతిలాడింది గౌరమ్మ.

ఎవలో బిందె అందుకున్నరు. గౌరమ్మ మనుసు కొద్దిగా నిమ్మలమయింది.

"ఇగో... బిందె పట్టిచ్చినట్టుగాదు. ఆ బిందె మీలెక్క లకే వత్తది. మీరు తొమ్మిదే పట్టుకోవాలె." ఎవరో.

"అదే.. అట్లెట్ల పడుతం."

"మరి ఇట్లెట్ల.. నువ్వే దానకర్ణునివా... నీ ఇంట్ల నుంచి దానం చెయ్యి." ఖాళీ బిందె గౌరమ్మ చేతి కచ్చింది. కండ్లకు నీళ్లచ్చినయి.

"ఓ వదినే.. జెట్టజెట్టమెయ్యి. ఇట్ల అడుగుల అడు గేత్తే పది బిందెలు ఎప్పుడు మోత్తవు.." ఓ పరాచికం. అందరు మొగోళ్ల ముందు తడిసిన బట్టలతో నడవ డానికి ఇబ్బంది. కొత్త కోడలైతే ఒక చేతి సింగులు. నడుము మీద బిందె. గిరుక తిరిగినట్టు తిరుగుతుంది.

"ఏమాయె.. జెట్టనరా." బిందె నింపి లైనులోంచి భార్య కేకె.

"అరె వత్తన్న ఆగు." ఇంట్ల బిందెపోసి సరసర ఉరికస్తూ భర్త.

"పొయ్యి మీద పాలున్నయి. పొంగుతయి. దించిరా" నిండు బిందె ఇచ్చి ఖాళీ బిందె తీసుకుంటూ భార్య.

"అరేయ్... ఓరిరాజు. లెక్కవెడుతున్నావురా...? వాళ్లయి పది దాటినయి. నువ్వు ముచ్చటంటే మోతు

## ప్రేమ

ప్రేమ
అఖిలం, అమరం,
అగాధం, అద్భుతం.
పొడి పొడి మాటలను
కొన్నిటిని పోగేసుకుని
ప్రేమను నిర్వచించ బూనడం
హనుమంతుని ముందు
కుప్పిగంతులు వేయడమే
అనంతమైన ఆకాశానికి
ఎల్లలు ఉల్లేఖించడమే
ప్రేమ అనిర్వచనీయం
అనుభవైక వేద్యం
సర్వాంతర్యామి స్వరూపం
సమస్త సృష్టికి మూలం.

-జి. నీలకంఠం

లు సాపుతవు. నోరు ఉన్నోల్లది ఊరు. గట్టిగ మాట్లాడితే రెండు ఎక్కువ పోత్తడు" ఎనుక నుంచి అదిలింపు.

"మొఖాలు సూసుకుంట వోత్తడు" ఇంకెవరో.

నీళ్లు పడుతున్న భార్య "సరె. నీ మొఖం గూడా సూపియ్యి. ఎక్కువపోత్తడు. నీకు గూడా మొఖముంది గదా" అన్నది కోపంగా.

అది విన్నంక కొందరి మొఖాల్లో నవ్వు తేలింది. కొందరు మొఖం మాడ్సుకున్నరు.

ఇట్లగాదని గౌరమ్మ బిందెతో లైను గట్టింది. ఒక్క అడుగు ముందుకు వస్తే రెండడుగులు ఎనుకకు పోతుంది. కడుపు కుతకుత ఉడుకుతుంది. తెల్లారితే పొద్దుగూకితే సంటిపిల్ల సన్ను వడుత లేదనో, బర్రె పాలు జున్ను అయితున్నయనో ఇంట్ల సిచ్చుపుడుతుందనో వల్లు పట్టుమని తన దగ్గరికి వచ్చినోల్లే. ముదుపులు ఏయించుకున్నోల్లే. సంటిదుడ్డె సచ్చిపోతే పాలియ్యని బర్లకు మరుగు మందు తీసుకపోయినోల్లే. ఇంతవరకు అంతా మంచి వాళ్లు గానే కనిపించిండ్రు. ఇప్పుడు వాళ్లలో కొత్త వ్యక్తుల్ని చూస్తుంది గౌరవ్వ. ఏ శక్తి వాళ్ల మనుసును మార్చిందో తెలువడంలేదు.

గౌరమ్మను మరింత ఉడికిస్తున్నట్టు బురబుర ట్యాంకర్ ఇంకొంత ముందుకు పోయి ఆగింది.

"వాడకట్టుకు అందరు పెద్ద మనుసులే. ఊదు గాలది పేరిలెవ్వది. నిన్న ముందు వాడకట్టుకు ఇరువై ఇరువై బిందెలు పోసిండ్రట. మూడు రోజులకొక్కనాడు రావట్టె. పదిపదే పొయ్యవట్టె. ఎవ్వలు అడుగకపాయిరి. నల్ల సల్లగుండ నల్లంటున్నదెమో.. బిల్లు తీసుకోవట్టిరి గనీ నీల్లియ్యకపాయిరి..." సదువుతనే ఉన్నది సొంటి కొమ్ము నర్సవ్వ. బక్కగుందని ఆపేరు పెట్టిండ్రు.

వెంట కూతురు కూడా వచ్చింది. డిగ్రీ చదువుతుంది. రోజూ ఈ పాటికి కాలేజికి తయారయ్యే ఆగంలో ఉండేది. నీళ్ల చుక్కలేక ఈరోజు మాత్రం ట్యాంకర్ కొరకు ఎదురు చూస్తు కూసుంది. ఎలాగైనా స్నానం మందం ఒక బిందె ఎక్కువగా పట్టుకోవాలనే ప్రయత్నంలో ఉంది.

"నువ్వొర్రకు. అందరి లెక్క మనం.." అంటూ ట్యాంకర్ వెనుకకు వచ్చింది. పది బిందెలు నిండినంక పంచాది మొదలయింది. తొమ్మిదే అంటుంది డిగ్రీ పిల్ల. కాదంటాడు రాజు. కొట్లాట. ఒక బిందెగాదు గదా ఒక సుక్క గూడా ఇయ్యనని రాజుపైపు నట్టును తింపిండు. తింపడం ఇటు సైదు గాకుండ అటు సైదు తింపిండు. అంతే!

డిగ్రీ పిల్లను చూడంగనే ట్యాంకర్‌కు జాలి కలిగింది. చిలిపి ఆలోచన కూడా వచ్చింది. పైపుల నీళ్లు ఆగిపోవల్సింది బోయి బుదుగ్గుమని వేంగగ బయట కచ్చినయి. నీళ్ల దార పిల్ల చాలికి తగిలింది. సూత్తున్నంత సేపట్ల తడిసి ముద్దయింది. ముద్దబంతి పువ్వు పిల్లవాన పాటల హీరోయినయింది.

తప్పును తెలుసుకున్నరాజు ఆగమాగాన నట్టును ఇటు సైదు తింపి పిల్ల తిడుతున్నా వినిపించుకోకుంట మూడిండ్ల ముందుకు పోయిండు.

గౌరమ్మకు కోప మత్తుంది. కడుపు మసులుతుంది. 'నీళ్లు పొడుగాను. ఇప్పుడే గిట్లుంటే ఎండకాలంల ఎట్ల..? ఏంకత? ఇప్పటికే ట్యాంకర్ పుణ్యమాని పక్క పక్కోల్లే పగోల్లయింద్రు. ముందు ముందు ఒకలనొకలు పొడుసుక సత్తరా ఏంటిది..?' అనుకుంది.

'ఓరి కొడుకా.. జర ఈ ఒక్క బిందె పట్టుకోనియ్యి' అంటూ ముందుకు పోయింది గౌరమ్మ.

"అవ్వా... కొడుకు, ఇంటికాడ. ఇక్కడ గాదు... పొద్దటినుంచి దేవుని కొరకు చూసినట్టు సూత్తున్నం. నాలుగు వాడలకు ఒక్క ట్యాంకర్ ఇత్తండు. నీళ్లు ఉండెనో అయిపాయెనో..." గౌరమ్మను ఎనక్కితోసి గుంపుకు గుంపు ట్యాంకర్ మీద పడింది.

"ఎవలన్నా బిందె నింపక పోతరా.." అని ఆశగా చూసింది గౌరమ్మ. ఆమె కండ్లల్ల కారంగొట్టి మొండి చెయ్యి ఊపుకుంట రెండు మూడు కుదుపులతో మోరి మీదికి ఎక్కి దిగి మలుపు తిరిగింది ట్యాంకర్. నాలుగు అడుగులు ముందుకు పోతే ఇంకోవాడ. గుంపులు గుంపులుగా జనం ప్లాస్టిక్ బిందెలతో చూస్తున్నారు.

గౌరమ్మకు కోపమచ్చింది. 'నీతల పండు వలుగ.. ఒక్క బిందె కోసం ఎంత దూరం రావాల్రా. నీ ఇంట్ల నుంచి ఇత్తున్నావురా..' అంటూ లొల్లి కెత్తుకుని ఎదురు తిరిగింది.

టాంకర్ ఆగింది. "ఓ ముసల్దానా.. ఒర్రకు. మాళ్లా రాకు. పట్టుకో. ఒకల వాడకు ఇంకోలు రావదు" అంటూ వెనక్కి వచ్చిండు రాజు.

"ఏమాయెరో ఉన్నయన్ని అక్కడనే పోస్తవా.. ఇటు రావా.." ముందు వాడలవాళ్లు. "సూత్తున్నం.. సూత్తున్నం. ఎవలకు ఒక్క బిందె ఎక్కువిచ్చినా ట్యాంకర్‌ను కదుల నియ్యం" వెనుకవాడోళ్లు.

గౌరమ్మ ట్యాంకర్ వైపు కింద బిందె పెట్టింది. రాజు నట్టు తిప్పిండు. ఎంత తింపినా చుక్క నీళ్లు రాలలేదు. ట్యాంకర్ అప్పుడే ఖాళీ అయిపోయింది.■